

నేటి పత్రిక
# ప్రజా వార్త
NETI PATRIKA PRAJA VARTHA
తెలుగు వారపత్రిక

TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL
Prajavatha-Online Telugu News
http://www.prajavartha.com
వీక్షించండి .. చదవండి.. చెప్పండి..

విజయవాడ | తేదీ: 24 - 30 ఏప్రిల్ 2023 | ఎడిటర్ : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి : 2 | సంచిక : 46 | పేజీలు : 4, వెల: రూ.5


# రబీ ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి

## వ్యవసాయశాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉన్నతస్థాయి సమీక్ష



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
రబీ ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ధాన్యం సేకరించిన తర్వాత రైతులకు తప్పనిసరిగా రసీదు అందచేయడంతోపాటు అందులో కొన్ని సూచనలు తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు ఎలా ఉండాలి? అందుకోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే వివరాలతో సూచనలు ఉండాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తీసుకొచ్చిన 1967 టోల్‌ఫ్రీ నంబర్ రసీదులో తప్పనిసరిగా ఉండాలని, దళారులు, మిల్లర్ల ప్రమేయానికి తావులేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కొనుగోళ్ల సందర్భంగా ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖలపై సమీక్షించిన ముఖ్యమంత్రి జగన్ ఉన్నతాధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. విదేశాల్లో డిమాండ్ ఉన్న వరి వంగడాలను సాగు చేయడంపై అన్నదాతలకు అవగాహన కల్పించాలి. ఆ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలి. దీనివల్ల ఎగుమతులు పెరిగి రైతులకు మంచి ధర వస్తుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే మే నెలలో వైఎస్సార్ రైతు భరోసా తొలి విడత పెట్టుబడి సాయాన్ని జమ చేసేలా ఏర్పాట్లు చేయాలి. మే 10వతేదీ కల్లా అర్హులైన జాబితాలను సిద్ధం చేయాలన్నారు. కొనుగోలు చేసిన పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు వీలుగా దశలవారీగా ప్రతి ఆర్బీకే పరిధిలో ఒక గోడౌన్ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలి.

ఖరీఫ్ సీజన్ కోసం అవసరమైన నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలి. ఏటా పంపిణీ చేసే ఇన్‌పుట్స్ పెంచుకుంటూ వెళ్లాలి. పంపిణీ ప్రక్రియ మరింత సమర్థంగా ఉండాలి. ఆర్బీకేల్లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలి. మే 20వతేదీలోగా మిగిలిన ఆర్బీకేల్లో వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి సాగు ఉపకరణాల పంపిణీ చేపట్టాలి. జూలై కల్లా 500 ఆర్బీకేల పరిధిలో కిసాన్ డ్రోన్లు అందుబాటులోకి తెచ్చేలా సన్నద్ధం కావాలన్నారు.

రబీలో సాగైన 48.02 లక్షల ఎకరాల్లో పంటలను ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేసినట్లు సమీక్షలో అధికారులు తెలిపారు. రైతులందరికీ డిజిటల్‌గానే కాకుండా భౌతికంగా కూడా రశీదులిచ్చి పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖలకు డేటాను పంపినట్లు వివరించారు. ఈ-కేవైసీ 97.5 శాతం పూర్తైందన్నారు. రబీలో సాగైన పంట ఉత్పత్తుల కొనుగోలుకు అన్ని చర్యలు చేపట్టామని, తొలిసారిగా రైతులకు అందిస్తున్న గన్నీ బ్యాగులు, రవాణా ఖర్చుల చెల్లింపులు దాదాపుగా పూర్తి చేశామని చెప్పారు.

ఖరీఫ్ సీజన్‌లో రూ.7,233 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా ఇప్పటికే రూ.7,200 కోట్లు రైతులకు చెల్లించినట్లు వెల్లడించారు. సాంకేతిక కారణాల వల్ల మరో రూ.33 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలియచేయడంతో వాటిని పరిష్కరించి రైతులకు చెల్లింపులు జరిపేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, వ్యవసాయశాఖ సలహాదారు ఐ.తిరుపాల్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ముఖ్య కార్యదర్శులు గోపాలకృష్ణ ద్వివేది, చిరంజీవి చౌదరి, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్, ఉద్యాన, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖల కమిషనర్లు ఎస్ఎస్ శ్రీధర్, రాహుల్‌పాండే, హెచ్.అరుణ్‌కుమార్, విత్తనాభివృద్ధి, పౌరసరఫరాల సంస్థల ఎండీలు డాక్టర్ గెద్దం శేఖర్‌బాబు, జి.వీరపాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యప్రదేశ్‌లోని రేవాలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు

- సుమారు రూ.17,000 కోట్లు విలువ చేసే జాతీయ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి జాతికి అంకితం
- సుమారు రూ.2,300 కోట్ల విలువైన వివిధ రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
మధ్యప్రదేశ్‌లోని రేవాలో జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఉద్దేశించి ఈరోజు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. దాదాపు రూ. 17,000 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి జాతికి అంకితం చేశారు. దాదాపు రూ.2,300 కోట్ల విలువైన వివిధ రైల్వే ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేయడంతో పాటు పూర్తి చేసిన పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టులలో మధ్యప్రదేశ్‌లో 100 శాతం పూర్తి చేయబడిన విద్యుదీకరణ, వివిధ డబ్లింగ్, గేజ్ మార్పిడి మరియు విద్యుదీకరణ ప్రాజెక్టులు ఉన్నాయి. గ్వాలియర్ స్టేషన్ పునరాభివృద్ధికి కూడా ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, మా విద్యావాసినికి, శౌర్య భూమికి ప్రణామం చేస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. గతంలో తన పర్యటనలను, ఇక్కడి ప్రజల అభిమానాన్ని గుర్తు చేసుకున్నారు. దేశం నలుమూలల నుండి వర్చ్యువల్ విధానంలో పాల్గొన్న 30 లక్షల మందికి పైగా పంచాయితీ ప్రతినిధుల సమావేశాన్ని ఈ సందర్భంగా ప్రధాన మంత్రి ప్రస్తావించారు. ఇది భారత ప్రజాస్వామ్యానికి ధైర్యానికి చిహ్నానికి నిదర్శనమని అన్నారు. ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరి తమ తమ పనులు పరిధి భిన్నంగా ఉండవచ్చని, అయితే దేశానికి సేవ చేయడం ద్వారా పౌరులకు సేవ చేయాలనే ఉమ్మడి లక్ష్యం కోసం అందరూ పనిచేస్తారని ఆయన సూచించారు. గావ్ ఔర్ గరీబ్ - గ్రామాలు మరియు పేదల కోసం ప్రభుత్వ పథకాలను పంచాయితీలు పూర్తి అంకితభావంతో అమలు చేస్తున్నందుకు ప్రధాన మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఈ రోజున ప్రారంభించిన పలు ప్రాజెక్టులను ప్రధానంగా ప్రస్తావిస్తూ, చింద్వార-నైన్‌పూర్-మండ్లా ఫోర్ట్ రైలు మార్గాన్ని విద్యుదీకరించడం గురించి ప్రధాన మంత్రి ప్రస్తావించారు. ఇది ఈ ప్రాంత ప్రజల ఢిల్లీ-చెన్నై మరియు హౌరా-ముంబైలకు కనెక్టివిటీని మరింత సులభతరం చేస్తుందని అలాగే గిరిజన ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొన్నారు. చింద్వార-నైన్‌పూర్ మధ్య ఈరోజు ప్రారంభించబడిన కొత్త రైళ్లను కూడా ఆయన ప్రస్తావించారు. అనేక పట్టణాలు మరియు గ్రామాలు నేరుగా చింద్వార, సియోనిలోని జిల్లా ప్రధాన కార్యాలయానికి అనుసంధానించబడతాయని, నాగ్‌పూర్ మరియు జబల్‌పూర్‌లకు వెళ్లడం కూడా చాలా సులభం అవుతుందని చెప్పారు. ఈ ప్రాంతంలో అత్యధిక వన్యప్రాణుల సంపద గూర్చి ప్రస్తావిస్తూ రైలు కనెక్టివిటీని పెంచడం వల్ల పర్యాటకం కూడా వృద్ధి చెందుతుందని మరియు కొత్త ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని ప్రధాన మంత్రి అన్నారు. "ఇది డబుల్ ఇంజిన్ ప్రభుత్వ శక్తి" అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. తన ప్రసంగాన్ని ముగిస్తూ, ఈ ఆదివారంతో 100 ఎపిసోడ్‌లను పూర్తి చేసుకుంటున్న 'మన్ కీ బాత్' కార్యక్రమం పట్ల చూపుతున్న ప్రేమకు, ప్రతి ఒక్కరికి మరియు ప్రజల నుండి లభిస్తున్న మద్దతుకు ప్రధాన మంత్రి ధన్యవాదాలు తెలిపారు. మన్ కీ బాత్‌లో మధ్యప్రదేశ్ ప్రజలు సాధించిన వివిధ విజయాల గురించి ప్రస్తావించిన ప్రధాన మంత్రి, 100వ ఎపిసోడ్ కోసం అందరూ ట్యూన్ చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్, కేంద్ర సహాయ మంత్రులు ఫగ్గన్ కులస్తే, సాధ్వి నిరంజన్ జ్యోతి, కపిల్ మోరేశ్వర్ పాటిల్, మధ్యప్రదేశ్ రాష్ట్ర పార్లమెంటు సభ్యులు మరియు ఆ రాష్ట్ర మంత్రులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రక్తహీనత నివారణకు పటిష్టమైన చర్యలు



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధన (సస్టెయినబుల్ డెవలెప్మెంట్ గోల్స్-ఎస్‌డిజి)కు సంబంధించి వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ, పాఠశాల విద్యా , గ్రామ వార్డు సచివాలయాల ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం సోమవారం నాడు మంగళగిరిలోని ఎపిఐఐసి బిల్డింగ్ ఆరోఫ్లోర్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఆధ్వర్యంలో జరిగింది. మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర, పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, సెర్ప్ సీఇవో ఎం.డి.ఇంతియాజ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.టి.కృష్ణబాబు ఏమన్నారంటే... కౌమార బాల బాలికలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులలో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. స్కూలు హెల్త్ అంబాసిడర్ల వ్యవస్థను బలోపేతం చేయాలి. అనీమియాకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ సేకరించిన సమాచారాన్ని మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని అంగన్వాడీ సెంటర్లతో అనుసంధానించాలి. జగనన్న పోషణ కిట్లను సమర్థవంతంగా పంపిణీ చేయాలి. దేశంలోనే కౌమార బాల బాలికల్లో రక్తహీనత నిర్ధారణ పరీక్షలను ప్రతి మూడు నెలలకోసారి నిర్వహిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. రక్త హీనత ఎక్కువగా వున్న కౌమార బాల బాలికల వివరాలను ఫ్యామిలీ డాక్టర్ విధానంలో పనిచేస్తున్న వైద్యాధికారికి చికిత్స నిమిత్తం రిఫర్ చేస్తారు. ఐఎఫ్ ఎ ట్యాబ్లెట్లు అవకముందే వైద్య ఆరోగ్యశాఖకు మధ్యాహ్న భోజన పథకం యాప్ ద్వారా సమాచారం అందచేస్తారు. స్వేచ్ఛ కార్యక్రమం కింద శానిటరీ న్యాప్కిన్స్ పై కూడా చర్చించారు. బాల బాలికలకు శానిటరీ న్యాప్కిన్స్ కొనుగోలుకు సంబంధించిన నిధులను వైద్య ఆరోగ్యశాఖ పాఠశాల విద్యా శాఖకు అందచేస్తుంది. ప్రతి నెలా తప్పనిసరిగా గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగా వారికి పౌష్టికాహారాన్ని అందచేస్తారు. రక్తహీనత వున్న గర్భిణులకు మధ్యాహ్న భోజనం తరువాత వేసుకునే లా రెండు ఐఎఫ్ఎ ట్యాబ్లెట్ల అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందచేస్తారు. ఈ వివరాలను వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ్ యాప్‌లో నమోదు చేస్తారు. ఐఎఫ్ఎ ట్యాబ్లెట్లను 50 శాతం మేర వినియోగించిన వెంటనే అంగన్వాడీ వర్కర్లు వైద్యాధికారికి, ఎఎన్ఎంకు స్టాక్ అలెర్ట్ ఇండెంట్‌ను అందచేస్తారు. ఐఎఫ్ఎ ట్యాబ్లెట్లను బఫర్ స్టాక్ పెడుతున్నాం. రక్తహీనత తీవ్రంగా, మధ్యస్థంగా వున్న గర్భిణుల వివరాలను ఫ్యామిలీ డాక్టర్ కు అందచేయటం ద్వారా మెరుగైన చికిత్సను అందిస్తారు.

# ఎస్.సి, ఎస్టీ కంపొనెంట్ చట్ట సవరణకు ఆరు మాసాల్లో ప్రభుత్వానికి నివేదిక

**-రాష్ట్ర స్థాయి కమిటీ చైర్మన్& ఉపముఖ్యమంత్రి (గిరిజన సంక్షేమం) రాజన్న దొర పీడిక**



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
ఎస్.సి, ఎస్టీ కంపొనెంట్ చట్టం-2023 రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్సు త్వరలో చట్ట రూపం దాల్చనున్న నేపథ్యంలో చట్ట సవరణకై రాష్ట్ర స్థాయి కమిటీ తగిన సూచనలు, సలహాల నివేదికను ఆరు మాసాల్లో ప్రభుత్వానికి అందజేయాల్సి ఉందని రాష్ట్ర స్థాయి కమిటీ చైర్మన్ మరియు ఉప ముఖ్యమంత్రి (గిరిజన సంక్షేమం) రాజన్న దొర పీడిక పేర్కొన్నారు. సోమవారం వెలగపూడిలోని ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఆయన అధ్యక్షతన రాష్ట్ర స్థాయి కమిటీ తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ రాజన్న దొర పీడిక మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్.సి, ఎస్టీల అభ్యున్నతిని కాంక్షిస్తూ పదేళ్ల కాలానికి రూపొందించబడిన ఆంధ్రప్రదేశ్ ఎస్.సి., ఎస్.టి.సబ్ ప్లాన్ చట్టం-2013 ఈ ఏడాది జనవరి 24వ తేదీతో ముగియడం జరిగిందన్నారు. దీని స్థానంలో ఎస్.సి, ఎస్టీ కంపొనెంట్ చట్టం-2023 రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్సును ఈ ఏడాది జనవరిలో జారీచేయడం జరిగిందన్నారు. ఆబిల్లును రాష్ట్ర శాసనసభ, రాష్ట్ర శాసనమండలి ఆమోదం తెలుపుతూ రాష్ట్ర గవర్నర్ ఆమోదానికి పంపడం జరిగిందన్నారు. రాష్ట్ర గవర్నర్ కూడా ఆ బిల్లుకు ఆమోదం తెలపడం జరిగిందని, సవరించిన చట్టం నోటిఫికేన్ జారీ ప్రక్రియలో ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఎస్.సి, ఎస్టీ కంపొనెంట్ చట్టం-2023 ను మరింత మెరుగ్గా రూపొందించేందుకు అవసరమైన సూచనలు, సలహాలతో ప్రభుత్వానికి నివేదికను అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఈ ఏడాది మార్చి 11న జిఓఎంఎస్ నెం.91ను జారీ చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ రానున్న ఆరు మాసాల్లో ఎస్.సి, ఎస్టీ కంపొనెంట్ చట్టం-2023 సవరణకు అవసరమైన సూచనలు,సలహాలతో నివేదికను ప్రభుత్వానికి అందజేయాల్సి ఉందని ఆయన తెలిపారు. ఈ కమిటీ పలుమార్లు సభ్యులతో సమావేశాలు నిర్వహించి రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీలను మరింతగా అభ్యున్నతి పథంలో నడిపేందుకు అవసరమైన సూచనలు, సలహాలతో సమగ్రమైన నివేదికను ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఈ కమిటీలోని సభ్యులైన పార్లమెంట్ సభ్యులు డా.మద్దిల గురుమూర్తి, శాసనసభ్యులు ఉన్నమట్ల ఎలీజా, డా.మొండితోక జగన్మోహనరావు, కంబాల జోగులు, విశ్వసరాయి కళావతి తదితరులు ఈ సమావేశంలో పాల్గొని ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీల పరిస్థితులు, వారి జీవన ప్రమాణాలపై సుదీరంగా చర్చించారు. గత పదేళ్ల కాలంలో వారి సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు, వాటి వెచ్చింపులు, వాటి వల్ల ఎస్సీ, ఎస్టీలకు లకు ఒనగూరే ప్రయోజనాలపై సభ్యులు చర్చించడం జరిగింది. అదే విధంగా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభ్యున్నతికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ పరంగా అమలు చేస్తున్న పలు పథకాల అమలు తీరును సభ్యులు చర్చించి, వారి అభ్యున్నతికి అవసరమైన తగు సూచనలు, సలహాలను చైర్మన్ దృష్టికి తీసుకు వచ్చారు, ఎస్.సి, ఎస్టీ కంపొనెంట్ చట్టం-2023 సవరణకు అవసరమైన పలు సూచనలు, సలహాలను అందజేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిఫల్ సెక్రటరీ జి.జయలక్ష్మీ, సంచాలకులు విజయకృష్ణన్, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు మురళీ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# శ్రీనివాస కళ్యాణ మహోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
కలియుగ దైవం శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం మే 6న అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియం నందు తిరుమల తిరుపతి దేవస్థాన పండితులచే డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ శ్రీనివాసరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జరగనున్నట్లు ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ఈ మేరకు అజిత్ సింగ్ నగర్లోని జనహిత సదనం నందు మంగళవారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. శ్రీదేవి భూదేవి సమేత తిరుమలేశునికి వసంతోత్సవం, తిరుమలలో జరిగేలా శ్రీనివాసుని కళ్యాణం, రాత్రికి మహానివేదన, వేద ఆశీర్వవచనం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. కావున భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా రెడ్డి, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఇసరపు దేవి, ఉమ్మడి రమాదేవి, ఎండి షాహినా సుల్తానా, అలంపూరు విజయలక్ష్మి, శర్వాణి మూర్తి, కొంగితల లక్ష్మీపతి, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, హాఫీజుల్లా, ఉమ్మడి వెంకట్రావు, అలంపూరు విజయ్, మోదుగుల గణేష్, ఇసరపు రాజా రమేష్, గుండె సుందర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## గరుడ కంటి & దంత హాస్పిటల్ ప్రారంభం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
అజిత్‌సింగ్‌నగర్‌లో గరుడ కంటి & దంత హాస్పటల్ మాజీ మంత్రి కొడాలి వెంకటేశ్వరరావు (నాని) చేతుల మీదుగా ఆదివారం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజిత్‌సింగ్‌నగర్‌లో గరుడ కంటి & దంత వైద్యశాల ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని, ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఉపయోగించుకోవాలని అన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఫైబర్‌నెట్ ఛైర్మన్ గౌతంరెడ్డి మాట్లాడుతూ మిడిల్ క్లాస్, లోయర్ మిడిల్ క్లాస్, అజిత్‌సింగ్‌నగర్ వాసులకు ఈ హాస్పిటల్ చాలా ఉపయోగపడుతుందని, నిర్వాహకులు శ్రీహర్ష, ఇబ్రహీంలను అభినందిస్తున్నానని అన్నారు. సేవా కార్యక్రమముల ద్వారా సేవ చేయాలని సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్యం అందించాలని ఆయన అన్నారు. నిర్వాహకులు శ్రీ హర్ష, ఇబ్రహీం మాట్లాడుతూ తిరువూరు, నందిగామ మా బ్రాంచీలు ఉన్నాయని, విజయవాడలో ఈ బ్రాంచ్ మూడో బ్రాంచ్ అని 10 సంవత్సరాలు వైద్య రంగంలో మాకు అనుభవం ఉందని, ఓపి నెల రోజులు వరకు ఫ్రీగా చేస్తామని, అత్యాధునిక పద్ధతిలో కంటి మరియు దంత పరీక్షలు నిర్వహించి కుట్లు లేకుండా నూతన పద్ధతుల ద్వారా ఆపరేషన్ చేస్తామని ఆయన అన్నారు. ఈ హాస్పిటల్‌లో ఇద్దరు డాక్టర్లు ఎప్పుడు అందుబాటులో ఉంటారని కంటికి సంబంధించి కంటిలో పొర, నీటి కాసులు ఇతర వ్యాధులు నూతన పద్ధతుల ద్వారాట్రీట్మెంట్ చేస్తామని అన్నారు. ఎమ్మెల్సీ రుహల్లా, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో రోబోటిక్ ఎగ్జిబిషన్ ప్రారంభం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త:**
వేసవి ఆట విడుపు కోసం నగరంలోని బందర్‌రోడ్‌లో వజ్రా గ్రౌండ్స్ నందు రోబోటిక్ సూపర్ హీరోస్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఆదివారం నగరంలోని వజ్ర గ్రౌండ్స్‌నందు రోబోటిక్ సెట్టింగ్‌లతో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను తూర్పు నియోజకవర్గం వైసిపి ఇంచార్జి దేవినేని అవినాష్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ రోబోటిక్ హీరోస్ ఆకృతులలో వీక్షకుల కంటికి ఇంపుగా ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు. రోబోటిక్ సెట్టింగ్లను ఆయన పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రోబోటిక్ సూపర్ హీరోస్ ఎగ్జిబిషన్‌ను రోబోటిక్ సెట్టింగ్‌లతో నగరంలోనే ప్రారంభించారని తెలియజేశారు. ఈ రోబోటిక్ ఎగ్జిబిషన్ వేసవి విడిదిగా ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. రోబోటిక్ సూపర్ హీరోస్ ఆకృతులు ఎగ్జిబిషన్ లో ప్రత్యేకంగా ఆకర్షిస్తాయని వీక్షకులకు ఎంతో ఆనందాన్ని ఇస్తాయని వెల్లడించారు.

నిర్వాహకులు మాట్లాడుతూ కిరణ్, గోపి మాట్లాడుతూ రోబోటిక్ సెట్టింగ్ విజయవాడ వాసులను ఎంతగానో అలరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వేసవిలో నగరవాసుల కోసం ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. సూపర్ మ్యాన్, స్పైడర్ మ్యాన్, ఐరన్ మ్యాన్, అక్వా మ్యాన్ జంగిల్ మ్యాన్, హీమ్యాన్, బ్యాట్ మెన్, వకాండ లేడీ, ట్రాన్సఫార్మర్స్, పవర్ రెంజర్స్, హల్క్ డాక్టర్ స్ట్రేంజ్, కెప్టెన్ అమెరికా బొమ్మలు పిల్లలని ఎంతగానో అలరించనున్నా యని పేర్కొన్నారు. ఎగ్జిబిషన్లోని సెట్టింగులు చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఎంతగానో ఆకట్టుకోవడంతోపాటు ఆశ్చర్యచకితులను చేస్తాయని ఆయన పేర్కొన్నారు. రోబోటిక్ ఎగ్జిబిషన్లో జెయింట్ వీల్, కొలంబస్, టోరాటోరా, బ్రేక్ డ్యాన్స్, చిన్న పిల్లల ఆటవస్తువులు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ.. ఇటు చిన్నారులు, అటు పెద్దవారికి ఆహ్లాదంతో పాటూ ఆనందాన్ని పంచుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. కలకత్తా, జైపూర్, ఢిల్లీ, మహారాష్ట్ర చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ఎగ్జిబిషన్లో ప్రదర్శించారని పేర్కొన్నారు. పాఠశాలలు కళాశాలలకు సెలవుల సందర్భంగా ఈ రోబోటిక్ ఎగ్జిబిషన్ నగరవాసులను ఎంతగానో అలరిస్తాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రిహన నాహీద్, నిర్వాహకులు గోపి, భాను అడపా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఒక్క అనీమిక్ కేసు కూడా రాకూడదు



**మచిలీపట్నం, నేటి పత్రిక ప్రజావార్త :**
ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు, విలేజ్ హెల్త్ క్లినిక్ల పనితీరు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తా-కలెక్టర్ పి.రాజాబాబు జిల్లాలో గర్భవతులు కిషోర్ బాలికలు పాఠశాల విద్యార్థులలో ఒక్కరు కూడా అనిమీయాతో బాధపడకూడదని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ఆయా శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. జిల్లాలో గర్భవతులు, కిషోర్ బాలికలు, పాఠశాల విద్యార్థులలో అనీమియాతో ఎంతమంది ఉన్నారు? అనీమియా నివారణకు తీసుకుంటున్న చర్యలు గురించి కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. అనీమియా డేటా పరిశీలించిన కలెక్టర్ జిల్లాలో ఒక్కరు కూడా అనీమీయాతో బాధపడకూడదు అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులందరూ జగనన్న గోరుముద్ద కింద రాగి జావ వంటి పోషక ఆహారం, మధ్యాహ్నం భోజనం తీసుకునే విధంగా చూడాలని, భోజన అనంతరం వారికి ఐరన్, జింక్ మాత్రలు అందించాలని, వాటిని వారు వినియోగించేలా చూడాలని, ఈ కార్యక్రమంపై పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. అనీమియా నివారణకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలన్నారు. ఒకేచోట ఎక్కువ కేసులు నమోదైతే ఎపిడమిక్ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో రాండంగా పరిశీలిస్తామన్నారు. జిల్లాలో డయేరియా కేసులు ఒకే చోట నమోదైతే వెంటనే ఆ ప్రాంతంలో తాగునీరు పరీక్షలు నిర్వహించాలని వాటర్ లీకేజీలు గుర్తించాలని నీటి కాలుష్యానికి కారణాలు తెలుసుకొని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జి.గీతాబాయి, ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ విజయభారతి డీఈవో తహెరా సుల్తానా పాల్గొన్నారు.

# స్త్రీకి రక్షణ కవచం మద్యపాన నిషేదమే

: ఆర్.ఆర్.గాంధీ నాగరాజన్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
స్త్రీకి రక్షణ కవచం మద్యపాన నిషేదమేనని, స్త్రీలు బానిసత్వం నుంచి బయటకు రావాలంటే మద్యపాన నిషేదమే మార్గమని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు ఆర్.ఆర్.గాంధీ నాగరాజన్ ఆకాంక్షించారు. ఆదివారం గాంధీనగర్‌లోని ధర్నాచౌక్‌లో గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు ఆర్.ఆర్.గాంధీ నాగరాజన్ కళ్ళకు గంతలు కట్టుకొని సంపూర్ణ మద్యపాన నిషేదం కోసం రిలే నిరాహార దీక్ష చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ నాగరాజన్ మాట్లాడుతూ మహాత్మా గాంధీని అత్యంత కిరాతకంగా చంపిన రోజు 30వ తేదీ కాబట్టి ప్రతి నెలా 30వ తేదీ ఆయన చేసి త్యాగాలను భావితరాల వారికి గుర్తు చేసేందుకు తాను కళ్ళకు గంతలు కట్టుకొని దీక్ష చేస్తాన న్నారు. స్త్రీ రక్షణ లేని స్వాతంత్ర్య... స్వాతంత్ర్యం కానేకాదన్నారు. గాంధీ కలలు కన్న నిజమైన స్వాతంత్ర్యం ఇదేనా అని ప్రశ్నించారు. మద్యపానానికి బానిసైన వారి అనేక కుటుంబా లు ఇప్పుడు ఎన్నో నాశనమైపోతు న్నాయన్నారు. బుద్ధి వున్నవాడు అయితే మద్యపాన నిషేదం చేస్తాడని చెప్పిన ఆనాటి ముఖ్యమంత్రిని ప్రశ్నించిన ఈనాటి ముఖ్యమంత్రి ఇప్పుడు ఆ విషయం మరిచి ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడంలేదని వాపోయారు. ఎలక్షన్స్‌లో కూడా మద్యాన్ని వరదలుగా పారించి కార్యకర్తలను గూండాలుగా మార్చే విషసంస్కృతి ఇప్పటికీ కొనసాగుతుందన్నారు. సేవలు అందించాల్సిన నాయకులు దేశాన్ని దోచుకుంటూ దేశాన్ని నాశనం చేస్తున్నారన్నారు. దేశంలో అన్ని తప్పులకు ప్రధాన కారణం మద్యపానమేనన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో 20 శాతం ఈ మద్యం నుంచే వస్తుందని అందుకుని దీని నిషేదంపై ప్రభుత్వం తటపటాయిస్తుందన్నారు. మాదకద్రవ్యాలు, మద్యపాన నిషేదం పై సెంట్రల్, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుని చట్టసవరణ తీసుకురావా లన్నారు. భావితరాల వారికి మంచి భవిష్యతు వుండాలంటే మద్యపాన నిషేదం, డ్రగ్స్, మత్తుపదార్థాలు నిషేదం ఒక్కటే దారి అని దానికి అందరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ కలలు కన్న స్వరాజ్యం భారతదేశంలో రావాలన్నారు. బ్రతికితే దేశం కోసం, చస్తే దేశం కోసం అనే నినాదంతో తాను ఉద్యమ బాట నడుస్తున్నానన్నారు.

ఓటును నోటుకు అమ్ముకునే సంస్కృతిని విడనాడి. ఓటు అనే బ్రహ్మాస్త్రంతో మంచి నాయకుడిని ఎన్నుకుని మన భవిష్యత్తు తరాల కోసం అయినా అందరూ నడుం కట్టాలన్నారు. ఆర్టికల్ 47 మన రాజ్యాంగంలో మద్యపాన నిషేదానికి రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని వుంది. రాజ్యాంగపరంగా వున్నది మన హక్కు. అది లేకుండా దేశాన్ని చూడాల్సిన బాధ్యత మనది అందుకే ఈ పోరాటమని తెలిపారు. మద్యపానం వలన ఎందరో మహిళల తాళిని తెంచే స్థాయి వచ్చినా కూడా మీ పరిపాలన కొనసాగించాలా? అని అన్నారు. బీహార్‌లో ముఖ్యమంత్రిగా వున్న నితీష్‌కుమార్ ఆరు సంవత్సరాలుగా మద్యపానా న్ని నిషేదించారు. సుమారు 2.50 లక్షల మంది ప్రజలు, ప్రతిపక్షాలు కూడా మద్యపానం కావాలని పోరాడి కేసులు వేసినాగాని అక్కడి ప్రభుత్వం మాత్రం మద్యపానం నిషేదాన్ని తీసివేయలేదు. అక్కడ స్త్రీ రక్షణనే ముఖ్యంగా తీసుకున్నారు. అక్కడ వున్న ముఖ్యమంత్రికి స్త్రీ రక్షణ ప్రధాన ధ్యేయమనే భావం, ఆలోచన ఇక్కడ ముఖ్యమంత్రికి ఎప్పుడు వస్తుందన్నారు. అక్కడ వున్న పరిపాలనా విధానాన్ని ఇక్కడ ఎందుకు అవలంభించరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గాంధీ ట్రస్ట్ మహిళా అధ్యక్షురాలు ఆర్.ఎన్. శివరంజ ని, ట్రస్టు రాష్ట్ర అధ్యక్షురాలు బాపతి భారతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధి కోసం జులై5న రాష్ట్ర వ్యాప్తంగా వాక్ ఫర్ లైబ్రరీస్ కార్యక్రమం



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
వాక్ ఫర్ లైబ్రరీస్ (గ్రంథాలయాల కోసం పుస్తకంతో నడక) కార్యక్రమాన్ని జులై 5వ తేదీన రాష్ట్రం మొత్తం పల్లెల్లో, పట్టణాల్లో చేస్తున్నట్లు ఆంధ్రసారస్వత పరిషత్ నిర్ణయించినట్లు ఆ సంస్థ అధ్యక్షులు గజల్ మ్యాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలియజేశారు. మంగళవారం మధ్యాహ్నం మంగళగిరిలో వున్న ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయాన్ని శ్రీనివాస్ సందర్శించారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావును శ్రీనివాస్ కలిసి, తమ సంస్థ చేయబోయే వినూత్న కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ యొక్క స్ఫూర్తిదాయకమైన భాగస్వామ్యాన్ని కోరుతూ ఛైర్మన్‌కి లేఖ ఇచ్చారు. డాక్టర్ గజల్ శ్రీనివాస్‌ని మర్యాదపూర్వకంగా మందపాటి శేషగిరిరావు సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గ్రంథాలయాల ఉద్యమంపైన, గ్రంథాలయాల వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఒక చక్కని పాట పాడతానని ప్రకటించారు.

అనంతరం జరిగిన ప్రెస్మీట్లో డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ... గ్రంథాలయాల అభివృద్ధి కోసం, విద్యార్థులను గ్రంథాలయాలకు మరింత దగ్గర చేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సామాజిక సాహిత్య సేవా సంస్థల్ని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యుల్ని చేయాలనుకుంటున్నట్టు తెలిపారు. గ్రంథాలయం అందరికీ సంబంధించింది కాబట్టి, గ్రంథాలయో రక్షతి రక్షితం అని మనందరం ప్రతిజ్ఞ చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు. గతంలో నేను గ్రంథాలయ శాఖలో పనిచేశాను. నాకు అన్నం పెట్టిన సంస్థ రుణం తీర్చుకునే అవకాశం ఇలా రావడం ఆనందంగా వుందన్నారు.

గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ... డాక్టర్ గజల్ శ్రీనివాస్ గ్రంథాలయ పరిషత్క రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి గ్రంథాలయాల డిజిటలైజేషన్ ప్రక్రియ మొదలుపెట్టి విజయవంతంగా కొనసాగుతున్న శుభసందర్భంలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ గ్రంథాలయాల అభివృద్ధి కోసం వాక్ ఫర్ లైబ్రరీస్' కార్యక్రమాన్ని చేపట్టడం గొప్ప శుభపరిణామమన్నారు. అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెలలో ప్రతి శనివారం డిప్లొమా ఇన్ జర్నలిజం అభ్యర్థులతో పాటు వర్కింగ్ జర్నలిస్టులకు ఆన్‌లైన్ అవగాహన తరగతులు

-సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
డిప్లొమా ఇన్ జర్నలిజం అభ్యర్థులతో పాటు వర్కింగ్ జర్నలిస్టులకు ఆన్ లైన్ అవగాహన తరగతులను నిపుణులచే నిర్వహించ నున్నట్లు సి. ఆర్. ఎపి మీడియా అకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శనివారం ఎంపిక చేసిన అంశం పై ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు ఈ అవగాహన తరగతులకు రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులందరూ ఆన్ లైన్ విధానం లో హాజరుకావచ్చని ఆయన తెలిపారు. డిప్లొమా ఇన్ జర్నలిజం క్లాసులు మే నెల 1 వ తేదీ నుంచి మొదలుకానున్న దృష్ట్యా మే నెల మొదటి శనివారం 6 వ తేదీన "సాహిత్యం-సమాజం" అనే అంశం పై ప్రసిద్ధ సాహితీ వేత్త 'ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్' ప్రసంగం వుంటుందని ఛైర్మన్ తెలిపారు. డిప్లొమా ఇన్ జర్నలిజం అభ్యర్థులకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు మొదటి క్లాసు, 9 గంటల నుంచి 10 గంటల వరకు రెండో క్లాసు నిర్వహించడం జరుగుతుందన్నారు. "మే" 1 వ తేదీన ప్రముఖుల సందేశాలతోబాటు, శుభాకాంక్షలుంటాయన్నారు. మే నెల 2 వ తేదీ నుంచి క్లాసులు నిర్వహణ ఉంటుందన్నారు. 'మే' నెల 2 వ తేదీన జర్నలిజం- నిర్వచనం, పరిధి, రేడియో మాధ్యమం-లక్షణాలు అనే అంశాల పైన, 3వ తేదీ జర్నలిజం-సమాజంలో దాని స్థానం, రేడియో-మాధ్యమం, స్వభావం, పరిధి, అనే అంశాల పైన, 4వ తేదీ స్వాతంత్రోద్యమంలో పత్రికల రచనాశైలి, రేడియో వివిధ కార్యక్రమాల రూప కల్పన అనే అంశాల పైన, 5వ తేదీ స్వాతంత్రోద్యమంలో పత్రికల పాత్ర, స్ఫూర్తి, రేడియో కార్యక్రమాల రూప కల్పన -జాగ్రత్తలు అనే అంశాల పైన డా. ఎన్.ఈశ్వరరెడ్డి, డా. నాగసూరి వేణు గోపాల్‌లు తరగతులు నిర్వహిస్తారని సి.ఆర్. మీడియా అకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సి. ఆర్. ఎపి మీడియా అకాడెమి ఆధ్వర్యంలో ప్రారంభించనున్న జర్నలిజంలో డిప్లొమా కోర్సుకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లెర్నర్స్ సపోర్ట్ సర్వీసెస్ బ్రాంచ్ డైరెక్టర్ ఎల్.వి.కె రెడ్డి కోర్సు కోర్డినేటర్‌గా వ్యవహరిస్తుండగా, నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగపు హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు శ్రీమతి డా. జి.అనిత, ఆంధ్రా విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగపు రిటైర్డ్ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు బాబీ వర్ధన్‌లు సహకారం అందిస్తున్నారు.

# సర్వే ఫలాలు ప్రజలకు చేర్చటంలో జెసిలదే కీలక భూమిక

– ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
భూసర్వే ఫలాలు ప్రజలకు చేర్చటంలో జిల్లా సంయిక్త పాలనాధికారులు ముఖ్యమైన భూమికను పోషించవలసి ఉందని ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం అన్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇటీవల జిల్లా సంయిక్త పాలనాధికారులుగా (జాయింట్ కలెక్టర్) బాధ్యతలు స్వీకరించిన ఐఎఎస్ అధికారుల కోసం తాడేపల్లి లోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం వేదికగా నిర్వహించిన భూసర్వే పునశ్చరణ సదస్సును ఆయన మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన అజేయ కల్లం మాట్లాడుతూ అధికారులు ప్రజాసేవతో ప్రజల మనస్సులలో సుస్థిర స్థానం సంపాదించుకోగలుగుతారన్నారు. ముఖ్యమంత్రి మానస పుత్రికగా ప్రారంభమైన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పధకం ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరేలా నిరంతర సమన్వయం, ప్రత్యక్ష పర్యవేక్షణ అవసరమన్నారు. ప్రణాళికా బద్దంగా భూముల రీసర్వే ను చేపట్టటం ద్వారా ఆ ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరేలా జాగ్రత్తలు తీసుకోవాలని భూపరిపాలన చీఫ్ కమీషనర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ అన్నారు. జిల్లా సంయిక్త పాలనాధికారుల సదస్సులో కీలకోపన్యాసం చేసిన ఆయన దోషాలకు తావులేని రీతిలో ఎవ్వరూ వేలెత్తి చూపని రీతిలో భూసర్వే పూర్తి చేయాలన్నారు. భూపరిపాలన, సర్వే సెటిల్ మెంట్ కమీషనర్ సిద్దార్ధ జైన్ మాట్లాడుతూ భూసర్వే ఫలితంగా అత్యధిక సంఖ్యలో గ్రామ సర్వేయర్లను నియామకాలు చేసి, వారికి 82 రకాల రీసర్వే శిక్షణలు ఇవ్వడం ద్వారా శాఖను మరింత పటిష్టపరచుకోగలిగామన్నారు. ఈ మానవవనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అదునాతన సాంకేతిక సర్వే పరిజ్ఞానం వినియోగంలో సైతం ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందని, సర్వేయర్లకు డ్రోన్ పైలట్లగ శిక్షణ ఇచ్చి వారిని డ్రోన్ పైలెట్లుగా వినియోగించుకుంటున్నామని అన్నారు.

ఒకరోజు పునశ్చరణ సదస్సులో సర్వే, సరిహద్దు చట్టంపై సిద్దార్ధ జైన్ అవగాహన కల్పించగా, ఆర్ఓఆర్ చట్టం, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై అదనపు సిసిఎల్ఏ ఎండి ఇంతియాజ్ సంయిక్త కలెక్టర్లకు వివరించారు. పంచాయతీ రాజ్ కమీషనర్ సూర్యకుమారి మరియు సర్వేశాఖ అదనపు సంచాలకులు రోణంకి గోపాలకృష్ణ స్వమిత్వ కార్యక్రమం గురించి దిశా నిర్దేశం చేసారు. రీజనల్ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు కార్స్, రోవర్స్ అంశాలను విపులీకరించగా, సర్వే ఐటి కార్యక్రమాల గురించి రచన తెలిపారు. సర్వే అకాడమీ వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ఎన్ వివిఎస్ కుమార్, కాకినాడ ఆర్ డిడి కెజియా కుమారి, కేంద్రకార్యాలయం డిడి ఝాన్సీరాణి పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ శత జయంతి సభా ప్రాంగణానికి భూమి పూజ

**- మహనీయుడు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు మే 28న జరుగనున్నాయి**



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
మహనీయుడు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు మే 28న జరుగనున్నాయి. ఎన్టీఆర్ శత జయంతి సభ, ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ నేతృత్వంలో "ఎన్టీఆర్ చారిత్రక ప్రసంగాలు, ఎన్టీఆర్ అసెంబ్లీ ప్రసంగాలు" పుస్తకావిష్కరణ జరుగనుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తాడిగడపవంద అడుగుల రోడ్‌లో సభా ప్రాంగణానికి టీడీపీ నేతలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ శత జయంతి కమిటీ చైర్మన్ టీడీ జనార్ధన్ మాట్లాడుతూ... ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ ఒక చరిత్ర సృష్టించారని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు వెంకట నారాయణ రచించిన "ఎన్టీఆర్ చారిత్రక ప్రసంగాలు & అసెంబ్లీ ప్రసంగాలు" పుస్తకం ఆవిష్కరణ ఉంటుందన్నారు. వెబ్‌సైట్, సావనీర్ హైదరాబాద్‌లో త్వరలోనే ఆవిష్కరిస్తామని చెప్పారు. ఈ సభకు చంద్రబాబు, రజనీకాంత్, బాలకృష్ణ పాల్గొంటారన్నారు. ఎన్టీఆర్ యాప్‌ను నారా లోకేష్ ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

**ఎన్టీఆర్ అంటేనే ఒక చరిత్ర: కొనకళ్ల నారాయణ**
ఎన్టీఆర్ అంటేనే ఒక చరిత్ర అని.. సినిమా, రాజకీయ రంగాల్లో ప్రత్యేక శైలి ఆయనదని తెలిపారు. చరిత్రలో గుర్తు ఉండిపోయేలా ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని అన్నారు. కమిటీ ఛైర్మన్ టి.డి.జనార్ధన్ ఆధ్వర్యంలో అనేక సభలు జరుపుతున్నారన్నారు. ప్రజలు కూడా ఎన్టీఆర్ చరిత్ర గురించి ఆసక్తిగా తెలుసుకుంటున్నారని అన్నారు. నేటి తరం కూడా యన్టీఆర్ గురించి ఆసక్తిగా వినడం గొప్ప విషయమని చెప్పుకొచ్చారు.

**సినీ, రాజకీయ రంగాల్లో రారాజు ఎన్టీఆర్: దేవినేని ఉమ**
సినీ, రాజకీయ రంగాల్లో రారాజు ఎన్టీఆర్ అని కొనియాడారు. పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లో సీఎం అయిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. పేదలను దృష్టిలో ఉంచుకుని అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వంద సభలు నిర్వహించి, మే 28 శత జయంతిని గొప్పగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, అభిమానులు, నాయకులు పాల్గొంటున్నట్లు తెలియజేశారు.

**ఆ ముగ్గురని ఒకేసారి చూడటం..: బోడె ప్రసాద్**
తన నియోజకవర్గంలో ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబు, బాలకృష్ణ, రజనీకాంత్ ఒకే వేదిక మీద చూడటం కనుల విందుగా ఉంటుందన్నారు. లక్షలాది మంది అభిమానులు ఈ శత జయంతి ఉత్సవాల్లో భాగం అవుతున్నారని తెలిపారు. ఎన్టీఆర్ చరిత్ర, ఆయన గొప్పతనం గురించి అందరూ తెలుసుకోవాలని పేర్కొన్నారు.

# సూడాన్‌లో చిక్కుకున్న తెలుగు వారిని సురక్షితంగా వెనక్కి రప్పించేందుకు చర్యలు

**- స్వస్థలాలు చేరేంతవరకూ అండగా నిలవాలన్న సీఎం**



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
అంతర్యుద్ధం కారణంగా సుడాన్‌లో చిక్కుకున్న తెలుగువారిని రక్షించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ముఖ్యమంత్రి వైయస్.జగన్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుని వారిని సురక్షితంగా వెనక్కి రప్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. స్వదేశానికి రాగానే వారిని స్వస్థలాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఉక్రెయిన్ సంక్షోభం సమయంలో వ్యవహరించిన మాదిరిగానే... వీరికి విమాన టిక్కెట్లు, ప్రయాణ సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎయిర్‌పోర్టులో వారిని రిసీవ్ చేసుకుని అక్కడనుంచి స్వస్థలాలకు చేరుకునే వారకూ కూడా వారికి అండగా నిలవాలని సీఎం ఆదేశించారు. సుడాన్‌లో ఇప్పటివరకూ సుమారు 56 మంది తెలుగువారు ఉన్నట్టు తెలుస్తోందని అధికారులకు సీఎంకు వివరించారు.

# రాజమహేంద్రవరంలో రు.475 కోట్లతో నూతనంగా వైద్య విద్య కళాశాల నిర్మాణం



**రాజమహేంద్రవరం, నేటి పత్రిక ప్రజావార్త :**
రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలోని ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో. 17 వైద్య విద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నారని ఆరోగ్య విద్య వైద్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడుదల రజిని పేర్కొన్నారు. సోమవారం మంత్రి పర్యటనలో రాజమహేంద్రవరంలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల భవనాలను పరిశీలించి అనంతరం మీడియాతోమాట్లాడుతూ నూతనముగా రు.475 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలో నిర్మించనున్న 17 వైద్య విద్య కళాశాల ప్రాధాన్యత క్రమంలో మొదటి దశలో విజయనగరం, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, నంద్యాల పట్టణాల్లో నిర్మించినట్లు పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన ఈ వైద్య విద్య కళాశాలను 150 ఎంబీబీఎస్ సీట్లతో ఈ విద్యా సంవత్సరంలోనే ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ పరంగా అన్ని పర్మిషన్లు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే రాజమహేంద్రవరంలో బాయ్స్ బాలుర హాస్టల్స్, పరిపాలన విభాగానికి సంబంధించిన బ్లాక్స్, వైద్య కళాశాల గదుల నిర్మాణం శరవేగంగా జరుగుతుందని మంత్రి రజని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో వైద్యరంగాన్ని స్వర్ణయంగా మారుస్తూ అర్హులైన అందరికీ ఉచిత వైద్య సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే 350 పడకలు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి రానున్న రోజుల్లో మరిన్ని బెడ్స్‌ను పెంచుతూ మెరుగైన వైద్య సేవలను రోగులకు అందించడం జరుగుతుందన్నారు. వైద్య కళాశాల నిర్మాణం వలన ఇక్కడ విద్యను అభ్యసించిన విద్యార్థులు ఈ ప్రాంతంలోనే వైద్య సేవలును ప్రజలకు అందిస్తారని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రజలకు ఎంత ఖర్చయినప్పటికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. ఆసుపత్రిలోని వైద్య పరికరాలు మరమ్మత్తులకు గాను బయో మెడికల్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం నూతనంగా ఒక్క మెడికల్ కాలేజీని కూడా అందుబాటులోకి తేలేదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ డా. కే.మాధవీలత, ఎంపీ మార్గని భరత్‌రామ్, రాజానగరం శాసనసభ్యులు జక్కంపూడి రాజా, వైద్య ఆరోగ్యశాఖ కమీషనర్ మురాలేదారన్‌రెడ్డి, రూడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి తదితరులు వున్నారు.

# సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి ఇకపై సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమి

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి పేరును సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమిగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. ప్రస్తుత తరుణం లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు అకాడమి పేరులో ప్రాతినిధ్యం వుండే విధంగా సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి పేరును సి.రాఘవాచారి ఆంధ్ర ప్రదేశ్ మీడియా అకాడమిగా మార్పు చేయాల్సిందిగా తాము కోరిన మీదట రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులు వెలువరించిందని సి.రాఘవాచారి ఆంధ్ర ప్రదేశ్ మీడియా అకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పేరును మార్చి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు సముచిత ప్రాధాన్యం కల్పించినందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డికి సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణకి, సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ టి.విజయకుమార్ రెడ్డికి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఆ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

# మే 2న ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు ఋణాల పంపిణీ

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు ఋణాల పంపిణీ కార్యక్రమం మే 2వ తేదీ ఉదయం గం.11.00లకు గాయత్రి కన్వెన్షన్ హాలు, సత్యనారాయణపురం, విజయవాడ నందు జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మల్లాది విష్ణు, వైస్ ఛైర్మన్, ఎ.పి. ప్లానింగ్ బోర్డు మరియు శాసనసభ్యులు విజయవాడ సెంట్రల్ హాజరవుతారని సీనియర్ బ్రాంచి మేనేజర్ గొర్తి శ్రీనివాస్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలైన బ్రాహ్మణులకు ప్రాజెక్టు ఋణాల మంజూరుపై అవగాహన ఈ సమావేశంలో కల్పించబడుతుందన్నారు. పురోహితులకు "పురోహిత మిత్ర" ఋణాలు, అర్చకులకు "అర్చక మిత్ర" ఋణాలు, బ్రాహ్మణ మహిళల ఆర్ధికాభివృద్ధికి "అరుంధతి ఋణాలు", పురుషుల స్వయం ఉపాధికి "వశిష్ఠ ఋణాలు", బిజినెస్ లోన్లు, మార్టిగేజ్ లోన్లు తదితర ఋణాలపై అవగాహన ఈ సమావేశంలో కల్పించబడుతుందన్నారు. విజయవాడ బ్రాహ్మణులు ఈ సమావేశానికి హాజరుకావల్సిందిగా కోరడమైనది. తమ వద్ద గల ప్రతిపాదనలను బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ విజయవాడ బ్రాంచి నందు సమర్పించవలసిందిగా కోరడమైనదని, ఇతర వివరములకు గొర్తి శ్రీనివాస్, సీనియర్ బ్రాంచి మేనేజర్ సెల్ : 9502709946, 9281029466, ల్యాండ్లైన్: 0866-2538448 నందు సంప్రదించవలసిందిగా కోరడమైనదన్నారు.

# అరుణాచల గిరి ప్రదక్షిణ భక్తులకు ఏపీఎస్ ఆర్టీసీ శుభవార్త




**విశాఖపట్నం, నేటి పత్రిక ప్రజావార్త :**
అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకి ఏపీఎస్ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. విశాఖ నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ వెల్లడించారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి బస్సు సర్వీసులు ప్రారంభమవుతాయన్నారు. 3న విశాఖలోని ద్వారక బస్‌స్టేషన్ నుంచి బయలు దేరి కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి, శ్రీకాళహస్తి క్షేత్రాల దర్శనం ఉంటుందన్నారు. 5న పౌర్ణమి రోజున అరుణాచల గిరి ప్రదక్షిణ అనంతరం 7న తేదీన విశాఖకి చేరుకుంటోందన్నారు. టికెట్స్ కావాల్సిన www.apsrtconline.inలో ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. అలాగే అదనపు సర్వీసులు కూడా నడపడానికి ఏపీఎస్ ఆర్టీసీ సిద్ధంగా ఉందని రవికుమార్ పేర్కొన్నారు.

# విశ్రాంత సీనియర్ జర్నలిస్టులను రాష్ట్ర ప్రభుత్వం తరపున గౌరవించడం సంప్రదాయం

**-సి.ఆర్. మీడియా అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు**



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
జర్నలిస్టుగా పనిచేసి, విశ్రాంత జీవనం గడుపుతున్న సీనియర్ జర్నలిస్టులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తరపున వారి ఇంటికే వెళ్లి గౌరవిస్తున్నామని సి.ఆర్. మీడియా అకాడెమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. ఎన్.టి.ఆర్ జిల్లా " కాసరనేని వారి పాలెం" గ్రామంలో వారి స్వగృహంలో ఆ గ్రామ సర్పంచ్ పెద్దు వరప్రసాద్‌తో కలిసి మంగళవారం ఉపేంద్ర బాబు ను సి.ఆర్. మీడియా అకాడెమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటి కాలం జర్నలిజం విలువలు నేటి తరానికి స్ఫూర్తి నివ్వాలని, అందుకు సీనియర్ పాత్రికేయుల్ని గౌరవించడం సంప్రదాయంగా మీడియా అకాడెమి చైర్మన్‌గా తాము ప్రారంభించి కొనసాగిస్తున్నామని కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. గారపాటి ఉపేంద్ర బాబు, పద్మ దంపతులను రాష్ట్ర ప్రభుత్వం తరపున శాలువాతో సత్కరించి, మెమెంటో ను చైర్మన్ అందచేశారు. జర్నలిజం రంగంలో సుదీర్ఘ కాలం పని చేసి తమ స్వగ్రామంలో కాలం గడుపుతూన్న తమను రాష్ట్ర ప్రభుత్వం మీడియా అకాడెమి ద్వారా గుర్తించి, గౌరవించినందుకు వెటరన్ జర్నలిస్టు గారపాటి ఉపేంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 40 సంవత్సరాల సుదీర్ఘ కాలం పత్రికా రంగానికి తాము సేవలందించిన అనుభవాలను ఉపేంద్రబాబు చైర్మన్‌తో పంచుకున్నారు. చాలా కాలంగా సమాజానికి దూరంగా కాలం వెళ్లదీస్తూన్నతమ వద్దకు మీడియా అకాడమి చైర్మన్ రావడం, తమను గౌరవించడం, పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, ముఖ్య మంత్రి జగన్‌మోహనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రంలో సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీ మామిడిపల్లి బాలగంగాధర తిలక్, కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థను ఉపేక్షించేది లేదు




**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**
బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలలు వీధుల వెంబడి తిండి కొరకు అడుక్కునే పరిస్థితి లేకుండా వారు బాల్యాన్ని స్వేచ్ఛగా అనుభవించే విధంగా వాతావరణం కల్పించుటకు, బాలల హక్కులను కాపాడడం కొరకు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఎల్లవేళలా ముందుంటుందని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ ఆర్ జి ఆనంద్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక అలిపిరి పోలీస్ స్టేషన్ సమీపంలోని అంగన్వాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ బాలల హక్కుల కమిషన్ సభ్యులు మాట్లాడుతూ భారత దేశంలో ముఖ్యంగా 51 నోడల్ ప్రాంతాలలో ప్రత్యేకించి పుణ్యక్షేత్రాలు గల ప్రాంతాలలో చిన్నపిల్లలు అడుక్కోవడం, బాల కార్మిక వ్యవస్థ ఉన్నట్లు ఎన్సిపిసిఆర్ సర్వేలో గుర్తించడం జరిగిందని, అందులో భాగంగా సంబంధిత పుణ్యక్షేత్రాల అధికారులతో, జిల్లా యంత్రాంగంతో సదరు అంశాలపై సమీక్ష చేసి, దిశా నిర్దేశం చేయబడుతుందని అన్నారు. అందులో భాగంగా నేటి మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుమలలో మహిళా శిశు సంక్షేమశాఖ, టీటీడీ అధికారులతో ఈ అంశాలపై సమీక్షించి తనిఖీ చేసామని, వారు స్క్వాడ్ ఏర్పాటు చేసుకొని తిరుమలలో ఉన్న ప్రాంతాలలో తరచూ తనిఖీలు చేపట్టి బాల కార్మిక వ్యవస్థ లేకుండా, చిన్నారులు అడుక్కునే పరిస్థితులు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో చేపట్టారని ఇది మంచి విధానమని కితాబిచ్చారు. ఎన్ సి పి సి ఆర్ క్షేత్రస్థాయిలో బాల కార్మిక వ్యవస్థ, చిన్నారులు అడుక్కోవడం లాంటి సామాజిక రుగ్మతల పై తనిఖీ చేసి చర్యలు తీసుకోవడం, పర్యవేక్షించడం జరుగుతోందని, అంగన్వాడి కేంద్రాలను, చైల్డ్ ఫ్రెండ్లీ పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేపట్టటం జరుగుతోందని అన్నారు. బాలల హక్కులను కాపాడే అన్నిరకాల కార్యక్రమాలను కమిషన్ చేపట్టి బాలలు వారి బాల్యాన్ని సంతోషంగా అనుభవించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలల హక్కుల పరిరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధికారి శివశంకర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య, సిడిపీఓ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 29న విజయవాడలో డా.నటరాజరామకృష్ణ శతజయంతి ఉత్సవాలు



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
ఈనెల 29వ తేదీ శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సా.5గం.లకు రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పద్మశ్రీ డా.నటరాజ రామకృష్ణ వారి శతజయంతి ఉత్సవాలు మరియు అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్నినిర్వహించనున్నారు. ఈ శతజయంతి ఉత్సవాలకు సంబంధించి రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి ప్రచురించిన గోడపత్రికను మంగళవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర దేవాదాయశాఖ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆవిష్కరించారు. పద్మశ్రీ డా.నటరాజ రామకృష్ణ శతజయంతి ఉత్సవాలు మరియు అంతర్జాతీయ నృత్య దినోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమీషనర్ ఎస్.సత్య నారాయణ, రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి సిఇఓ ఆర్.మల్లిఖార్జున, దేవాదాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నో అవార్డులు పొందినా.. ఈ అవార్డు మిన్న..!

**-తెలుగు కళా సమితి ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి కొండారెడ్డి**



**మంగళగిరి, నేటి పత్రిక ప్రజావార్త :**
రాష్ట్రం కాని రాష్ట్రం ముంబయ్‌లో కరోనా సమయంలో తెలుగు వారికి ఆపద్బాంధవుడిగా ముంబయ్‌లో ఆహారం, వసతి, ప్రయాణం వంటి అత్యవసర సేవలను అందించిన మానవతావాది మాదిరెడ్డి కొండారెడ్డి. ఇటువంటి వ్యక్తుల సేవలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి ఏటా ఉగాది సందర్భంగా అందించే పురస్కారాలలో అత్యంత ప్రభావవంతమైన సేవా రంగంలో మాదిరెడ్డి కొండారెడ్డికి గుర్తింపు కల్పించింది. ఈ సందర్భంగా మాదిరెడ్డి కొండారెడ్డి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన తన అనుభూతులను మీడియాతో పంచుకున్నారు. తెలుగు మరియు సంస్కృత అకాడమి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలోని నాగార్జున యూనివర్శిటీలో మంగళవారంనాడు జరిగిన ఉగాది పురస్కారాలు-2023 ప్రధానం కార్యక్రమంలో భాగంగా విద్య, వైద్యం, లలిత కళలు, జానపద, నాటక రంగం, వ్యవసాయ రంగం, సేవా రంగం, ప్రత్యేక కేటగిరి (చిత్రకళ) రంగాలకు చెందిన ఏడుగురికి రాష్ట్రం హోంమంత్రి తానేటి వనిత చేతుల మీదుగా ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి నగదు బహుమతితో ఘనంగా సత్కరించారు. సేవా రంగానికి సంబంధించి ముంబయ్‌కి చెందిన తెలుగు కళా సమితి ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి కొండారెడ్డికి పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాదిరెడ్డి కొండారెడ్డి మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో క్వారంటైన్ సెంటర్ ఏర్పాటు, భోజనాలు ఇతర వసతుల కల్పన, బాధితులకు రవాణా సౌకర్యం కల్పించడం వంటి విశేష సేవలందించినందుకుగాను అప్పటి మహారాష్ట్ర గవర్నర్ కోషియార్ చేతుల మీదుగా 2021లో కోవిడ్ వారియర్స్ అవార్డుతో పాటు పలు సేవా కార్యక్రమాలకు సంబంధించి అనేక అవార్డులు అందుకోవడం జరిగిందన్నారు. కానీ.. సొంత రాష్ట్రంలో ఇటువంటి ప్రతిష్టాత్మకమైన ఉగాది పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందన్నారు. ఏపి ప్రభుత్వం పురస్కారాలు ప్రధానం విషయంలో ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తెలుగు మరియు సంస్కృత అకాడమి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు లక్ష్మీపార్వతికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం అందుకోవడం తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు.

# దేశంలో రవాణా మౌలిక సదుపాయాలు నెలకొల్పేందుకు ప్రాధాన్యత

## శ్రీ సిటీని సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి





**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, మంగళవారం శ్రీ సిటీని సందర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో అద్భుతమైన రవాణా మౌలిక సదుపాయాలను నెలకొల్పేందుకు భారత ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర పర్యాటక, ఈశాన్య ప్రాంత సంస్కృతి అభివృద్ధి శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శ్రీ సిటీలోని ప్రధాన పారిశ్రామిక యూనిట్ల నిర్వాహణాధికారులతో మంత్రి నేడిక్కడ సమావేశమయ్యారు. అద్భుతమైన మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారుల- ప్రోత్సాహక వాతావరణంతో కూడిన అద్భుతమైన ప్రణాళికాబద్ధమైన ఈ పారిశ్రామిక కేంద్రాన్ని మంత్రి ప్రశంసించారు. ప్రధాన పారిశ్రామిక యూనిట్ల ముఖ్య కార్యనిర్వహణాధికారులతో మంత్రి సమావేశాన్ని నిర్వహించారు. వారిని ఉద్దేశించి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ "'వ్యాపారం సులభతరం చేయడం' అనే లక్ష్యంతో మంచి విధానాలతో కూడిన నమ్మకమైన సేవలను అందించే 'న్యూ ఇండియా'కు ప్రాతినిధ్యం వహిస్తున్న దేశంలోని మొదటి పది పెట్టుబడి గమ్యస్థానాలలో శ్రీ సిటీ ఒకటిగా నిలుస్తుందని, ఇది ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దార్శనికత ఫలితమని అన్నారు.

కిషన్ రెడ్డి ఉద్యోగావకాశాల కల్పన కోసం శ్రీసిటీ చేస్తున్న కృషిని అభినందిస్తూ , మెట్రో కోచ్‌లు, ఆటోమొబైల్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఎఫ్‌ఎంసిజి, ఆహారశుద్ధి, ఎయిర్ కండిషనర్లు, ఎలక్ట్రానిక్స్, ఫార్ములేషన్స్ మొదలైన వివిధ రంగాల్లో తయారీ పరిశ్రమలకు నిలయంగా ఉన్న శ్రీసిటీ చేస్తున్న కృషిని కేంద్ర మంత్రి ప్రశంసించారు. శ్రీ సిటీ ఏర్పాటు వల్ల అక్కడి బంజరు భూమి శక్తివంతమైన ఆర్థిక కేంద్రంగా మారడమే కాకుండా, ఈ వెనుకబడిన ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉపాధిని సృష్టించిందని, ఇక్కడి శ్రామిక శక్తిలో సగానికి పైగా మహిళలే కావడం చాలా సంతోషకరమైన విషయమని, అనేక ప్రత్యేక లక్షణాల శ్రీ సిటీ ఖచ్చితంగా ప్రపంచ స్థాయిలో వేరే చోట్ల నమూనాగా పరిశీలనాంశం అవుతుందని అన్నారు. ఈ నమూనా అమలు ఇప్పటికే ఇతర చోట్ల అనుకరించడానికి ఒక రిఫరెన్స్ కేస్‌గా మారిందని గమనించడం చాలా సంతోషకరమైన విషయం అని మంత్రి అన్నారు. శ్రీ సిటీ ప్రాంతం దాని స్థిరమైన పర్యావరణ అనుకూల, ఆధ్యాత్మిక పర్యాటక సమూహాలను ఆకర్షించడానికి గణనీయమైన సామర్థ్యాన్ని కలిగి ఉండడం సంతోషదాయకం అని మంత్రి హర్షం వెలిబుచ్చారు. తన మంత్రిత్వశాఖ తరపున అవసరం మేరకు అభివృద్ధి, ఉపాధి కల్పన పథకాలకు మద్దతు కల్పిస్తానని భరోసా ఇచ్చారు. మంత్రి రాక సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఘనస్వాగతం పలికారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటే సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చు



**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**
వైద్య పరీక్షలు నిర్వహించి అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ చేసి రోగం ముదరకుండానే వారికి చికిత్స అందించే దిశలో భాగంగా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించే దిశలో అసంక్రమిత వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు తుడా సహకారంతో సోమవారం కలెక్టరేట్‌లోని వివిధ శాఖల సిబ్బందికి మరియు తుడా సిబ్బందికి డ్రై రన్ నిర్వహించి రక్త పరీక్షలు ఈసీజీ చేపట్టడం ఉద్యోగస్తుల ఆరోగ్యానికి ప్రాధాన్యతగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోష దాయకం అని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి అన్నారు. ముందుగా కలెక్టర్ వైద్య పరీక్షల శిబిరాన్ని ప్రారంభించి వారు బిపి, రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం జేసి డీకే బాలాజీ డిఆర్ఓ శ్రీనివాసరావు తదితర అధికారులు సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టరేట్లోని వివిధ శాఖల సిబ్బందికి మరియు తుడా సిబ్బందికి సుమారు 3000 రూపాయల విలువ చేసే రక్త పరీక్షలు మరియు ఈసీజీ పరీక్షలు తుడా సహకారంతో ప్రీవియ ఏజెన్సీ ద్వారా సోమవారం ఉదయం ఉచితంగా చేపట్టడం జరిగిందని, ఆధార్ కార్డు రిజిస్ట్రేషన్ తో సంబంధిత ఉద్యోగుల వైద్య పరీక్షల నివేదికలు రెండు మూడు రోజులలో అందజేయడం జరుగుతుందని దీని వలన వారికి ఎవరికైనా ఏదైనా జబ్బులు ఉన్నట్లయితే రిపోర్టు ఆధారంగా తదుపరి చికిత్సలకు ముందస్తుగా వారు ఆరోగ్యాన్ని కాపాడుకునే వీలు ఉంటుందని ఇది ఒక బృహత్తర కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో తుడా,విసి హరికృష్ణ, డిఎంహెచ్ఓ శ్రీహరి, డి సి హెచ్ ఎస్ ప్రభావతి, ఎస్ డి సి భాస్కర్ నాయుడు, కోదండరామిరెడ్డి, కలెక్టరేట్ ఏవో జయరాములు, ప్రీవియ కంపెనీ ఎండి ఫణి,వారి వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విదేశాలకు వెళ్ళే వారికోసం సక్రమ వలసల పై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్న ఎపిఎన్ఆర్‌టి సొసైటీ

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ సంస్థ ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఎపిఎన్ఆర్‌టిఎస్) ప్రపంచవ్యాప్తంగా ఉంటున్న ప్రవాసాంధ్రుల సంక్షేమం, భద్రత, అభివృద్ధి ధ్యేయంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి మార్గదర్శకత్వంలో పనిచేస్తూ, ప్రవాసాంధ్రులకు అనేక ఉచిత సేవలు అందిస్తోంది. ఎపిఎన్ఆర్‌టి సొసైటీ అనేక సేవలు అందించడమే కాకుండా... ఉపాధి, ఉద్యోగ నిమిత్తం విదేశాలకు వెళ్ళే కార్మికులకు ముందస్తు అవగాహనా కార్యక్రమాలు చేపడుతోంది. మన రాష్ట్రం నుండి చాలామంది ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు. అయితే అక్రమ ఏజెంట్ల మాటలు నమ్మి, అవగాహన లేకుండా వెళ్లి ఇబ్బందులకు గురవుతున్న వారి కోసం, ఎపిఎన్ఆర్‌టిఎస్ వలసలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో ఈ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఏప్రిల్ 25వ తేదీన (మంగళవారం) ఉదయం 10:30 గంటలకు పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు నందు పద్మశ్రీ ఫంక్షన్ హాల్ (కూచిపట్ల, వల్లూరివారి వీధి) వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పి, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమీషనర్, పలు ప్రభుత్వ అధికారులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, నియామక ఏజెంట్లు (రిక్రూటింగ్ ఏజెంట్లు) వలసకార్మికులు, విదేశాలకు వెళ్లాలనుకుంటున్న వారు పాల్గొనాలని ఆహ్వానిస్తున్నాం. అలాగే మీకు ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేసుకోగలరు. విదేశాలకు వెళ్ళాలనుకుంటున్న వారు, విదేశాల్లో ఉన్నవారు ఏదేని సహాయం కొరకు ఎపిఎన్ఆర్‌టిఎస్ 24/7 హెల్ప్ లైన్ నంబర్లు 0863 2340678 వాట్సాప్: 85000 27678 ను సంప్రదించగలరు.

# రాష్ట్ర సంక్షేమం కోసం "చండీరుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యాగం"



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమం కోసం మే 12 నుండి ఆరు రోజులపాటు రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో చండీరుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యాగాన్ని తలపెట్టడం జరిగిందని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. మే 12 నుంచి మే 17వ తేదీవరకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ యాగానికి సంబంధించిన నిర్వహణ ఏర్పాట్లను ఆయన మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎంతో పవిత్రమైన ఈ యజ్ఞాన్ని రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండేలా, ప్రజలు సౌభాగ్యంతో జీవించేలా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఈ మహా క్రతువు మే 12వ తేదీ ఉ.5గం.లకు బ్రహ్మ ముహూర్త కాలంలో ప్రారంభమవుతుందన్నారు. ప్రధానంగా నాలుగు యాగ శాలలు ఉంటాయని, ఒక్కో యాగ శాలలో 108 కలశాలతో యాగం జరుగుతుందన్నారు. ఈ యాగ కార్యక్రమాల్లో 520 మందికి పైగా రుత్వికులు పాల్గొంటారని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంకాలం 6 గంటల నుంచి 9 గంటల వరకు యాగ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వీటితోపాటు ప్రతి రోజు అనేక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా చాగంటి కోటేశ్వరరావు, సామవేదం షణ్ముఖ శర్మ మొదలగు ప్రవచన కర్తలు కూడా పాల్గొని ప్రజలకు వివిధ ప్రవచనాలు ద్వారా హిందూ ధార్మిక పరిరక్షణ తదితర అంశాలను తెలియజేస్తారన్నారు. స్వరూపానందస్వామి, చినజీయర్ స్వామి, కుర్తాళ సిద్ధేశ్వర, మంత్రాలయ, జగద్గురు పండితారాధ్య తదితర పీఠాధిపతులు కూడా పాల్గొంటారన్నారు. యాగ శాలల లోపలికి ఎవరికీ అనుమతి ఉండదని, మే 17 తేదీన చివరి అంకంలో భాగంగా పూర్ణహుతి ఉంటుందన్నారు. యాగం నిర్వహణకు దాదాపు రూ.5 కోట్లు వ్యయం అవుతుందన్నారు. ఈ మహా యజ్ఞాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల సమన్వయం అవసరమని ఇందుకు వీలుగా 13 కమిటీలు పని చేస్తాయన్నారు. ట్రాఫిక్, ప్రోటోకాల్ వంటి అంశాలకు సంబంధించి జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌ల సూచనలు, సలహాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈనెల 28న తిరుపతికి విచ్చేయనున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ : కలెక్టర్

**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**
తిరుపతి జిల్లాలో 2 రోజుల పర్యటన లో భాగంగా తిరుపతికి ఈనెల 28న ఆం.ప్ర. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఉదయం 7.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి బయలుదేరి 9.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని అక్కడి ముంది రోడ్డు మార్గాన బయలుదేరి 9.40 గంటలకు శ్రీ పద్మావతి అతిథి గృహం తిరుపతి చేరుకుంటారు. 10.55 గంటలకు అక్కడి నుండి బయలుదేరి 11.00 గంటలకు మహతి ఆడిటోరియం చేరుకొని శ్రీ వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ 7వ స్నాతకోత్సవం లో పాల్గొని అనంతరం అక్కడ నుండి బయల్దేరి మధ్యాహ్నం 12.45 గంటలకు శ్రీ పద్మావతి అతిథి గృహం చేరుకొని భోజనానంతరం అక్కడి నుండి 2.00 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 2.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుండి హెలికాప్టర్ లో కడప జిల్లా పర్యటనకు బయలుదేరి తిరిగి సాయంత్రం 6.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని అక్కడి నుండి రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రి 7.45 గంటలకు శ్రీ పద్మావతి అతిథి గృహం తిరుమల చేరుకొని అక్కడే రాత్రి బస చేయనున్నారు. 29 న ఉదయం 7.05 గంటలకు తిరుమల శ్రీవారి ఆలయానికి చేరుకొని శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని తిరిగి 8.00 గంటలకు తిరుమల పద్మావతి గెస్ట్ హౌస్‌కు చేరుకొని అల్పాహారం అనంతరం 9.30 గంటలకు తిరుమల పద్మావతి అతిథి గృహం నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకొని ఉదయం 11.00 గంటలకు విజయవాడకు హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణం కానున్నారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం : దేవినేని అవినాష్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
మంగళవారం నాడు తూర్పు నియోజకవర్గం 21,22 డివిజన్‌లో కార్యకర్తల సమావేశానికి తూర్పు నియోజకవర్గ ఇన్ ఛార్జ్ దేవినేని అవినాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అవినాష్ మాట్లాడుతూ కృష్ణలంక ప్రాంత అంత కూడా వైస్సార్సీపీ పార్టీకి భలం అన్ని ఇక్కడ ఉన్న ప్రతి కార్యకర్త కూడా పార్టీకి ఎంతో ముఖ్యం అని వారికీ రానున్న కాలంలో పార్టీ వారికీ సముచిత స్థానం కలిపిస్తుంది అని అవినాష్ అన్నారు. వైస్సార్సీపీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాంతాలలో ఇప్పటి వరకు ఈ పార్టీ చేయలేని విందంగా అభిరుద్ది కార్యక్రమాలు, అనేక సంక్షేమ కార్యక్రమాలు చేసిన ఘనత మన వైస్సార్సీపీ పార్టీ అనే విషయాన్ని ప్రజలకు వివంచాల్సిన భాద్యత ప్రతి కార్యకర్తకు ఉంది అని అవినాష్ అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ పటిష్ఠతకు తీసుకోవాల్సిన చర్యలను, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక ను నాయకులకు, కార్యకర్తలకు వివరించారు. వైస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తన పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ జనరంజకంగా పరిపాలన చేస్తున్న జగన్‌కి మద్దతుగా కార్యకర్తలు నిలుస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న కుట్ర రాజకీయాలు తిప్పికొట్టాలని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ షో రాజకీయాలు చేస్తూ ప్రజలను ఎలా మోసం చేస్తున్నారో ప్రతి ఒక్కరికి అర్ధం అయేలాగా మనం చేసిన అభిరుద్దిని వారికి సాక్ష్యాలతో చూపించి ప్రతి పక్షాల కుట్రలను తిప్పి కొట్టాలని కార్యకర్తలకు సూచించారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లకి, కన్వీనర్లకు, గృహ సారధులకు అభినందనలు తెలియజేసారు. వీరికి పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుంది అని అవినాష్ అన్నారు. రానున్న కాలంలో అందరూ కూడా భేదాభిప్రాయాలు లేకుండా కలిసికట్టుగా పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాము ఎల్లపుడు ప్రతి కార్యకర్తలు కి పూర్తి అండగా ఉంటాం దేవినేని నెహ్రూ ఇంటి తలుపులు కార్యకర్తలు కోసం ఎప్పుడు తెరిసే ఉంటాయి అవినాష్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు, 21 వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, 22వ డివిజన్ కార్పొరేటర్ తాడిపత్రి కొండారెడ్డి, అధ్యాకులు టిపి రెడ్డి, జోగా రాజు, వైస్సార్సీపీ నాయకులు మీర్ హుస్సేన్, రామకృష్ణ, కసగని దుర్గారావు, పెద్ద అబ్బాయి, పుప్పాల రాజ, గౌరీ, ప్రసాద్, సుబ్బారెడ్డి, పవన్, నాగి రెడ్డి, కనకదుర్గ, అసిఫ్, ఫాజిలుద్దిన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రత్యేక హోదా పోలవరం, విభజన సమస్యలు ప్రధాన ప్రాంతీయ పార్టీల ఉదాసీనత



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
2019 ఎన్నికల తరువాత అధికార, ప్రతిపక్ష పార్టీలు హోదాను పక్కనబడేశాయి. కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడంతో మరలా వైసీపీ, టీడీపీ హోదా ప్రస్తావన ఎత్తుకున్నాయి. దీంతో హోదా వ్యవహారాన్ని రాజకీయ కోణంలో చూస్తున్నాయి తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోణంలో చూడటం లేదు. విభజన ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారానికి కేంద్రం పదేళ్ల గడువు విధించింది. ఏడాదిలోపు గడువు తీరిపోతుంది. ఈలోపు సమస్యలన్నీ పరిష్కరించుకోవాలి. పోలవరం విభజన హామీలు, ప్రత్యేక హోదాపై కేంద్రం చర్చ జరపాలి, ఆ చర్చ కూడా రాష్ట్ర కేంద్రమైన విజయవాడలోనే జరగాలి.

ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ప్రత్యేక హోదా రాష్ట్రాభివృద్ధికి కీలకంగా మారింది. విభజన సమయంలో కాంగ్రెస్ ఐదేళ్లపాటు హోదా ఇస్తామంటే, ఐదేళ్లు కాదు పదేళ్లు కావాలని బిజెపి కోరింది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విద్యాసంస్థలు, ప్రాజెక్టులు ఇలా ఒకటేమిటి నోటికొచ్చినవన్నీ చెప్పింది. దీన్ని రాష్ట్రంలో ఉన్న రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీలు తెలుగుదేశం, వైసీపీ ఆహ్వానించాయి. 2014లో సిఎంగా ఎన్నికైన చంద్రబాబునాయుడైతే ఏకంగా స్వర్గానికి మెట్టుగా వర్ణించారు. వైసిపి కూడా బిజెపికి వంతపాడిరది.

కొంతకాలం తరువాత హెూదా కాదు ప్యాకేజీ అన్నారు. దీంతో వైసిపి ప్రత్యేక హెూదా ఇవ్వాల్సిందేనని పట్టుబట్టి ఆందోళనబాటపట్టింది. కేంద్రం హోదా ఇవ్వడం సాధ్యం కాదని ప్రకటించింది. టిడిపి ఆందోళన బాటపట్టింది. ఈ రెండు పార్టీలూ హోదా విషయంలో బిజెపి ఆడమన్నట్లు ఆడాయి మినహా రాష్ట్ర ప్రజల అవసరాలు, ఆర్థికస్థితిగ్నతులపై ఒక నిర్ణయాత్మక వ్యవహారం ఏదీ నడపలేదు. రాష్ట్రం ఆర్థికంగా నష్టపోవడంలోనూ, ఇబ్బంది పడటంలోనూ బిజెపికి కీలకపాత్ర ఉందనడంలో ఏ మాత్రమూ సందేహం లేదు. పూర్తిగా రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజల ప్రయోజనాలు బిజెపి ప్రభుత్వానికి ప్రధాని మోడీకి పట్టలేదు. ఏ ఎండకాగొడుగు అన్నట్లు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసింది. మీ చావు మీరు చావండి మాకు సంబంధం లేదని చేతులు దులుపుకుంది బిజెపియే.

**ప్రత్యేక హెూదా**

2014 మార్చిలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ఎపికి ప్రత్యేక హోదా ప్రతిపత్తి ఇవ్వాలని తీర్మానించారు. హెూదా అమలు సాధ్యం కాదని తేల్చేశారు. 2016 సెప్టెంబర్ 8వ తేదీన అప్పటి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ యుపిఎ ప్రభుత్వంలో మన్మోహన్‌సింగ్ ఇచ్చిన హామీలను ఎన్‌డిఏ నెరవేరుస్తుందని ప్రకటించారు. హోదా వల్ల ఎంత ఆర్థికలబ్ది కలుగుతుందో అంతకు సమానమైన ప్రత్యేక ఆర్థికసాయం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. 2017 మార్చిలో బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ప్రకటించారు.

రాష్ట్రానికి అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్రం అడ్డుపుల్ల వేసింది. 2014 మే ఒకటోతేదీన జరిగిన క్యాబినెట్లో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఏర్పాటు చేశారు. అప్పటి వరకూ జరిగిన ఖర్చును రాష్ట్ర వాటాగా పరిగణించి అప్పటి నుండి కేంద్రం నిధులు వెచ్చిస్తుందని పేర్కొన్నారు. 2010-2011 ఆర్థిక సంవత్సరం నాటికి ప్రాజెక్టు వ్యయం 16010 కోట్ల రూపాయలుగా ప్రకటించారు. ప్రాజెక్టు వ్యయం, ఆయకట్టు అభివృద్ధి, ముంపు బాధితులకు మెరుగైన పరిహారం, తదితరాలన్నీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఎప్పటికప్పుడు పెరుగ్నుతాయని నిర్ణయించారు. 2014 లెక్కల ప్రకారం సవరించిన అంచనాలూ పిపిఏకు పంపాలని క్యాబినెట్లో తీర్మానించారు. దీనిఆధారంగా సుమారు రూ.54 వేల కోట్లకు ప్రాజెక్టు వ్యయం పెరిగింది. అందులో రూ.34 వేల కోట్లు పునరావాసం, పునర్నిర్మాణం కోసమేనని అంచనా వేశారు. 2017 మార్చి 15వ తేదీన జరిగిన క్యాబినెట్లో సమావేశంలో కేంద్రం నిధులు ఇవ్వదని నిర్ణయించారు. నాలుగేళ్లకూ కలిపి నాబార్డు నుండి 23,814 కోట్లు తీసుకునేందుకూ అనుమతిచ్చారు. ఇక్కడే కేంద్రం మెలికిపెట్టింది. అప్పటి వరకూ జరిగిన ఇరిగేషన్ కాంపోనెంట్‌ను మాత్రమే కేంద్రం భరిస్తుందని తెలిపింది. పునారావాసం, పునర్నిర్మాణం తమ పరిధిలోలేదని, అది రాష్ట్రం పరిధిలోదేనని చెప్పకనే చెప్పేసింది. ఒకవైపు ముంపునకు గ్నురవుతాయని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన కేంద్రం, ఆ ఏడు మండలాల్లో ఎంతమంది ఉన్నారు. ఎంత భూమి ఉంది, ఆర్‌అండ్‌ఆర్‌కు ఎంత ఖర్చవుతుంది అనే అంశాలు తెలియకుండా ఉండదు. అయినా పునరావసం బాధ్యత నుండి తప్పుకుంది. ఈ ప్రాజెక్టులో అతిపెద్ద ఖర్చు ఆర్‌అండ్‌ఆర్. దీన్ని అప్పటి టీడీపీగానీ, ఇప్పటి వైసీపీగానీ ప్రశ్నించడం లేదు.

**ఏమైందో తెలియని రైల్వేజోన్**

రాష్ట్రం విడిపోయిన తరువాత రాష్ట్రానికి కొత్త రైల్వేజోన్ రావాల్సి ఉంది. పునర్విభజన చట్టం 2014 షెడ్యూలు 13, మౌలిక వసతులు(8)లో రైల్వేజోన్ అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. ఐదేళ్ల అనంతరం 2019 ఫిబ్రవరి 27వ తేదీన విశాఖ కేంద్రం సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అప్పటి రైల్వే మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. కీలకమైన వాల్తేర్(విశాఖ) డివిజన్‌ను విడదీసి రాయగడ్ కొత్త డివిజన్ పెడుతున్నట్లు ప్రకటించారు. నూతన జోన్లో గుంతకల్లు గ్నుంటూరు, విజయవాడ డివిజన్లు మాత్రమే ఉంటాయని వెల్లడిరచారు. వాల్తేరు డివిజన్లో విశాఖపట్నం మాత్రమే ఉంటుంది. అంతకు మించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

**ముందుకు కదలని పెట్రోకెమికల్, రిఫైనరీ**

విభజనచట్టంలో పేర్కొన్న అత్యంత కీలకమైన వాటిల్లో గ్రీన్ ఫీల్డ్ క్రూడ్ ఆయిల్‌రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్. విభజన చట్టంలో షెడ్యూలు 13లో మౌలిక వసతుల్లో(4) స్పష్టంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒక క్రాకర్ యూనిట్ పెట్టాలని నిర్ణయించారు. ఎథెన్, నాఫ్తా, ప్రొఫేన్ గ్యాస్ నిల్వలను ఉపయోగించి దీన్ని నెలకొల్పాలని నిర్ణయించారు. గ్యాస్‌ను రసాయనిక ప్రక్రియలో విభజించి పెట్రో కెమికల్ ఉత్పత్తుల్లా వేర్వేరు అవసరాలకు ఉపయోగిస్తారు. ఇటువంటి వాటిని ప్రపంచవ్యాప్తంగా క్రాకర్ యూనిట్‌గా పిలుస్తున్నారు. రాష్ట్రంలో రూ.32 వేలకోట్లతో ఏడాదికి మిలియన్ మెట్రిక్ టన్నుల కెపాసిటీతో క్రాకర్ యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి గెయిల్, హెచ్‌పిసిఎల్ కన్సార్టియంగా ఏర్పడి రాష్ట్రంతో చర్చించిన అనంతరం ఏడాదికి రూ.975 కోట్లు వయబులిటీ గ్యాప్ రాష్ట్ర ప్రభుత్వం పూడ్చే విధంగా ఒప్పందం జరిగింది. దీనికోసం 2014 అక్టోబర్ 21న హెచ్‌పిసిఎల్‌తో రాష్ట్రం ఒప్పందం చేసుకుంది. వర్కింగు గ్రూపునూ ఏర్పాటు చేసింది. వేర్వేరు అంశాలను పరిశీలించిన అనంతరం 2016లో డిపిఆర్ ఆమోదించారు. కాకినాడలో క్రాకర్ యూనిట్ ఏర్పాటుకు ఒప్పందం జరిగింది. ఈ మొత్తం వ్యవహారంలో రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, కంపెనీలు, ఉపాధి కల్పనా యూనిట్లు అన్నీ కూడా హక్కుగా రావాల్సి ఉంది. కేంద్రంలో ఉన్న బిజెపి మాత్రం వాటిని రాజకీయ, వ్యాపార కోణంలో చూస్తూ ఇస్తే ఇస్తాం, లేకపోతే లేదు అని ప్రకటిస్తోంది. దీనిపై ఎవరూ ప్రశ్నించడం లేదు. రాష్ట్రానికి రావాల్సిన చట్టపరమైన హక్కులను సాధించుకోవడం పక్కనబెట్టి వైసీపీ, టీడీపీ, బిజెపితో రాజకీయ డ్రామాలాడుతున్నాయి.

2014-15 ఆర్థిక సంవత్సరంలో సుమారు 16 వేల కోట్ల రూపాయల ఆర్థికలోటు ఉందని లెక్క తేల్చి ఏడాదికి కొంత చొప్పున తీరుస్తామని కేంద్ర పాలకులు ప్రకటించారు. ఆచరణలో 2014 నుండి ఇప్పటి వరకూ సుమారు 4000 కోట్లు మించి రాలేదు. రుణమాఫీలు, పెన్షన్లు, విద్యుత్ సంస్థల్లో ఆర్థిక వ్యత్యాసాల సర్దుబాట్లు ఇవన్నీ కూడా లోటుకాదనీ ప్రకటించారు. రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణాలకు రూ.5000 కోట్లు కావాలని కోరితే గ్నుంటూరుకు రూ.500 కోట్లు, విజయవాడకు రూ.500 కోట్లు, అమరావతికి రూ.1500 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. వెనుకబడిన జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహాప్యాకేజీ పద్ధతిలో నిధులు ఇస్తామని చట్టంలో పేర్కొన్నారు. వీటి కింద ఉత్తరాంధ్రలో మూడు జిల్లాలు, రాయలసీమలో నాలుగు జిల్లాలకు కలిపి జిల్లాకు రూ.50 కోట్లు చొప్పున ఏడాదికి రూ.350 కోట్లు ఇస్తామని వెల్లడిరచారు. ఇది చట్టంలో పేర్కొన్న అంశం ఆచరణలో రూ.1050 కోట్లు ఇచ్చారు. అదే బుందేల్‌ఖండ్‌కు 2016లో రూ.7277 కోట్లు ఇచ్చారు. వెనుకబడిన జిల్లాలకు విడుదల చేసిన మొత్తంలో ఒక ఏడాది మొత్తం రూ.350 కోట్లను రాష్ట్రానికి జమచేసి, మరలా రాష్ట్రంతో సంబంధం లేకుండానే ఖాతాలో నుండి వెనక్కు తీసుకున్నారు. అనంతరం హోదా స్థానంలో ప్యాకేజీ ప్రకటించారు. ఎక్సటర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టు(ఇఏపి) కింద రూ.20,100 కోట్లు నిధులు ఇవ్వాలని రాష్ట్రం కోరింది. బ్యాంకుల నుండి రుణాలు ఇప్పించాలనీ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మొత్తాన్ని ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్(ఎఫ్ఆర్‌బిఎం) పరిధిలోకి తేవొద్దని కోరారు. ఇప్పటికీ రాష్ట్రానికి జీవనాడిగా పేర్కొంటున్న పోలవరానికి సంబంధించి సుమారు రూ.3000 కోట్లు కేంద్రం నుండి రావాల్సి ఉంది. అవి పునరావాసం కింద పెట్టినవని, అందువల్ల తాము ఇవ్వలేమనీ కేంద్రం చెబుతోంది. కేంద్రం మంజూరు చేసిన 17 ప్రధాన విద్యాసంస్థలకు సుమారు రూ.9000 కోట్లు రావాల్సి ఉండగా రూ.500 కోట్లకు మించి ఇచ్చింది లేదు. రాష్ట్ర ప్రభుత్వం 17 విద్యాసంస్థలకు రూ.607 కోట్లు కేటాయించింది. కీలకమైన వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రూ.1500 కోట్లు అవసరం ఉందని అంచనా వేస్తే మూడోవంతు కూడా ఇవ్వలేదు. విజయవాడ విమానాశ్రయానికి నిధులు ఇస్తామని చెప్పినా రూ.300 కోట్లు విదిల్చింది. అంతకు రెట్టింపు రాష్ట్ర ప్రభుత్వం పెట్టింది. ఉపాధి కల్పనా సంస్థ ఊసేలేదు. కడప ఉక్కు కర్మాగారం తమ పార్టీ నిర్ణయమని చెప్పిన బిజెపి అనంతరం తప్పుకుంది. దుగ్నరాజపట్నం పోర్టు, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని ప్రకటించి ఆచరణలో సాధ్యం కాదని తెలిపారు.

రాష్ట్ర విభజన సమస్యలు పరిష్కారం అవ్వాలంటే రాహుల్‌గాంధీ ప్రధాన కావాల్సి ఉంది. రాష్ట్రం దివాళా తీసింది. రావాల్సిన హక్కులు రాబట్టుకోవడానికి కృషి చేయాలి. దురదృష్టవశాత్తూ రాష్ట్రంలో ఉన్న వైసీపీ, టీడీపీ, జనసేన వంటి పార్టీలు ప్రశ్నించడంలేదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, హక్కుల కోసం, అభివృద్ధికోసం అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంది.

**-సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు 'కొలనుకొండ శివాజి'**

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt Ltd, D.NO: 33-5-5 Papaiah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District , Andhra Pradesh and Published From H.No: 24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line cross, VIJAYAWADA Krishna District Andhra Pradesh.
Editor Konduri Srinivasarao, RNI Title APTEL/2021/80559, Phone :9948877444, Email id: konduri9999@gmail.com